సాక్షి వికారాబాద్

బుధవారం । 6 । ఆగస్టు । 2025



కూలీల కొరత..

పరిగి మండలంలో వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 10లో ▸



ఎమ్మార్పీకే విక్రయించాలి

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని లేకుంటే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మీకుమారి హెచ్చరించారు. 10లో ▸



రైతులకు కరెంటు కష్టాలు!

పొలాల్లో కరిగేట్లు చేసుకుంటున్న సమయంలో కరెంటు సరఫరా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

పశు వైద్యంపై నిర్లక్ష్యం వద్దు

అడిషనల్ కలెక్టర్ సుధీర్



ఆస్పత్రి రికార్డులు పరిశీలిస్తున్న సుధీర్

అనంతగిరి: మూగజీవాలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయం, పశు వైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున మూగ జీవాలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ, హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం తింసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 50 రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దేముల్ ఎంఈఓ తోపాటు హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తింసన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 13 మంది విద్యార్థులు ఉన్నారు. వంట చేసేందుకు నిర్వాహకులు ముందుకు రాకపోవడంతో విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. ఈ విషయం తెలుసుకున్న డీఈఓ రేణుకాదేవి శనివారం పాఠశాలను సందర్శించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈఓ నర్సింగ్‌రావు, హెచ్‌ఎం ఫక్రుజమాకు షోకాజ్ నోటీసులతో పాటు చార్జి మెమో ఇచ్చినట్లు డీఈఓ తెలిపారు.

అరుణాచలేశ్వరుడి సేవలో బీఎంఆర్



అరుణాచలం క్షేత్రం వద్ద బీఎంఆర్ దంపతులు

తాండూరు: తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణమలై అరుణాచల పుణ్యక్షేత్రాన్ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం బీఎంఆర్ జన్మదినం కావడంతో అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాండూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.


వయోజనుల కోసం 'ఉల్లాస్'



మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీనివాసులు

కొడంగల్: చదువురాని వయోజనులు, నిరక్షరాస్యుల కోసం న్యూ ఇండియా లిటరసీ ప్రోగాం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమం చేపట్టిందని ఉల్లాస్ జిల్లా అధికారి శ్రీనివాసులు, ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో ఐకేపీ, మెప్మా శాఖలకు చెందిన ఆర్పీలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని వయోజనులు, నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి బోధనా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, ఆర్పీలు బాధ్యత వహించి నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గోపాల్, సీసీలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు



ఎరువులను పరిశీలిస్తున్న రాజరత్నం

యాలాల: జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం తెలిపారు. మంగళవారం యాలాల, లక్ష్మీనారాయణపూర్‌లోని ఫెర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తగినంతగా యూరియా వాడాలన్నారు. ప్రస్తుతం ఎకరాకు రెండు బస్తాల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు.

4 లేన్లుగా..



నాలుగు లేన్లుగా విస్తరించనున్న హైదరాబాద్ - బీజాపూర్ రహదారి

మన్నెగూడ - రావులపల్లి రోడ్డు విస్తరణ

- 73 కిలోమీటర్ల మేర పనులు
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

కొడంగల్: హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిని(ఎన్‌హెచ్ 163) జిల్లా పరిధిలో మరింత విస్తరించనున్నారు. మన్నెగూడ నుంచి కొడంగల్ మండలం రావులపల్లి వరకు నాలుగు లేన్ల రహదారిగా మార్చనున్నారు. మొత్తం 73 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ అనుమతి మంజూరు చేసింది. భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. ఇప్పటి వరకు ఉన్న రెండు వరుసల రోడ్డును ఇకపై నాలుగు లేన్లుగా మారుస్తారు. ఐదేళ్ల క్రితం హైదరాబాద్ - బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చింది. ఎన్‌హెచ్ 163గా నామకరణం చేసింది. కొన్ని సాంకేతిక సమస్యలు, కోర్టు కేసుల కారణంగా హైదరాబాద్ నుంచి మన్నెగూడ వరకు పనులు జరగలేదు. మన్నెగూడ నుంచి పరిగి, కొడంగల్ మీదుగా తెలంగాణ సరిహద్దు వరకు జాతీయ రహదారిని నిర్మించారు. రెండు లేన్ల రహదారి వేశారు. ప్రస్తుతం దీన్ని విస్తరించడానికి కేంద్రం అంగీకరించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2028 నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రంపై బాధ్యతలు

జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై ఉంచింది. ఇందుకు అవసరమైన భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంది. సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును కేంద్రానికి సమర్పించాల్సి ఉంది. డీపీఆర్ అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులతో పాటు నిధులు మంజూరు చేయనుంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయిన తర్వాత వాహనాల నుంచి టోల్ వసూలు చేస్తారు. జిల్లాలో ఇప్పటికే కొడంగల్ మండలం చిట్లపల్లి గేటు సమీపంలో ఒక టోల్ గేటు ఉంది. రహదారి విస్తరణ పూర్తి అయితే రెండో టోల్ గేట్‌ను మన్నెగూడ - పరిగి మధ్యలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ రహదారి పనులు పూర్తయితే పరిగి, కొడంగల్ పట్టణాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

" అన్ని వర్గాలకు మేలు



నాలుగు లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే రవాణా వ్యవస్థ మరింత మెరుగు పడుతుంది. నియోజకవర్గ ప్రజలు హైదరాబాద్ వెళ్లి రావడానికి సులభంగా ఉంటుంది. పరిగి, కొడంగల్ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుంది.

– తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జ్

సత్వరం పరిష్కరించండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పలు గ్రామాల్లో పాఠశాలల సందర్శన
- వసతులు కల్పించాలని ఆదేశం

దౌల్తాబాద్: భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరితో కలిసి సందర్శించారు. రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఇంత వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం మండలంలోని దౌల్తాబాద్, తిమ్మారెడ్డిపల్లి, బాలంపేట, గోకఫసలవాడ్ గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. తరగతి గదులకు తలుపులు, కిటికీలు అమర్చాలని ఆదేశించారు. స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండచడంతోపాటు మొక్కలు నాటాలని సూచించారు. కేజీబీవీ ప్రహరీ చుట్టూ బ్లూ షీట్లు అమర్చాలన్నారు. గోకఫసల్‌వాద్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఏఈ నాగేందర్‌కు సూచించారు. బాలంపేటలో నిర్మిస్తున్న పీహెచ్‌సీకి రోడ్డు వేయాలన్నారు. అనంతరం కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, తహసీల్దారు గాయత్రి, ఎంఈఓ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈఓ రేణుకాదేవి తదితరులు

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- 160 మంది బాల కార్మికులకు విముక్తి
- ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -11 కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందని ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏహెచ్‌టీయూ టీం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో సబ్ డివిజన్ల వారీగా 3 టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 160 మంది బాల కార్మికులను రక్షించినట్లు తెలిపారు. 145 మంది బాలురు, 15 మంది బాలికలు ఉన్నట్లు వివరించారు. మన రాష్ట్రానికి చెందిన 119 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది ఉన్నట్లు తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రత్యేక బృందాల సభ్యులను, ఇతర అధికారులను ఎస్పీ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ అన్నారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణంపై విద్యార్థి దశనుంచే అవగాహన కల్పించాలని అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మోహిదీన్, ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులు సంఘటితంగా ఎదగాలి

డీడీఎన్ఎస్ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ



మాట్లాడుతున్న వాసుదేవశర్మ

యాలాల: అర్చకులు సంఘటితంగా ఎదిగేందుకు కృషి చేయాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం (డీడీఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ పిలుపునిచ్చారు. మంగళవారం కోకట్ రోడ్‌లోని షిరిడీ సాయిబాబా మందిర ఆవరణలో జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో చండీ, కుబేర పాశుపత యాగ విజయోత్సవ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకులకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్కారు అందిస్తున్న అర్చక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, మఠం రాజశేఖరస్వామి, విజయ కృష్ణజ్యోషి, కరణం శ్రీకాంత్ పంతులు, జంగం జగదీశ్వర్ స్వామి, నటరాజ స్వామి, కిరణ్‌కుమార్ జ్యోషి, సంతోష్ స్వామి, వికారాబాద్ శ్రీకాంత్ స్వామి, గౌరారం రఘు స్వామి, సుమన్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ప్రభారి శ్రీకాంత్, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు జంగయ్య, బుచ్చన్న, పెద్దిని ప్రకాష్, కృష్ణాచారి, సుభాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



పైప్‌లైన్ దెబ్బతినడంతో వృథాగా పోతున్న తాగునీరు

తాండూరు టౌన్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నిర్వహించిన తవ్వకాలతో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరు కలుషితమవుతోంది. తాండూరు - చించోళి మార్గంలో సెయింట్ మార్క్స్ పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ పైప్ పగిలిపోవడంతో నీరు బయటకు వచ్చి మడుగును తలపిస్తోంది. లీకేజీ నీటిలో పందులు పొర్లాడుతున్నాయి. కుక్కలు, పశువులు దాహం తీర్చుకుంటున్నాయి. ఆ నీరే ఇంకి పైపుల్లో కలిసి ఇళ్లకు సరఫరా అవుతోంది. నెల రోజులుగా ఇలాగే జరుగుతోందని అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- యూటీఎఫ్ నాయకుడు రాములు డిమాండ్
- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

అనంతగిరి: విద్యారంగంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకుడు ఏ.రాములు(టీఎస్ యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) వికారాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. జీవో నంబర్ 25ను సవరించి కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా, ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు వర్క్‌లోడ్ కనుగుణంగా టీచర్ పోస్టులు కేటాయించాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల పెన్షన్ బెనిఫిట్స్ విడుదల చేయాలని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి పర్యవేక్షణాధికారి పోస్టులను నింపాలన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఈడీ అర్హతలు ఉన్న సీనియర్ ఎస్‌జీటీలందరికీ ప్రమోషన్ అవకాశం కల్పించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్స్, గురుకుల సిబ్బందికి 010 ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించుకొని జూలై 2023 నుంచి అమలు చేయాలని విన్నవించారు. జీవో 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. డీఎస్సీ 2008 కాంట్రాక్టు టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, 12 నెలల వేతనాలు చెల్లించాలని వర్తింపచేయాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బాబురావు, టి.పవన్ కుమార్, శివరాజ్, బసప్ప, వికారాబాద్ మండల అధ్యక్షుడు రాములు, ధారూరు అధ్యక్షుడు అజయ్ కుమార్, కోటపల్లి అధ్యక్షుడు రాంచంద్రయ్య, జిల్లా నాయకులు వినోద్ కుమార్, పరమేష్, ప్రభాకర్, వికారాబాద్ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ధారాసింగ్ నాయక్

- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్
- పెద్దేముల్‌లో ఉచిత వైద్య శిబిరం

తాండూరు రూరల్: మనిషికి ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్ అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన పెద్దేముల్‌లో ఎల్ఎస్ఆర్ యువసేన, ఎంఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 30 ఏళ్లు నిండిన తర్వాత ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎల్ఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకులు నర్సింలు ఆధ్వర్యంలో వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు డీవై నర్సిలు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు నసిరొద్దీన్, నాయకులు వెంకటయ్య, ఆనంద్‌చారి, రాంరెడ్డి, సంగమేశ్వర్, నాగభూషణం, ప్రకాష్‌రెడ్డి, రాములు, సురేష్, విజయ్, సచిన్, వెంకట్, దేవ్యాసింగ్, శ్రీను, వైద్యులు సుభాష్, ఐశ్వర్య, కావ్య, ఫజల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్


ఆస్పత్రిలో మోహన్

ధారూరు: పాత కక్షలను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరు మండలం రాంపూర్‌తండాకు చెందిన సబావత్ మోహన్‌పై ఇదే తండాకు చెందిన శంకర్, అతని భార్య లక్ష్మీబాయి, కొడుకు రాజేశ్ ఈనెల 1న గొడ్డలి, రోకలి, ఇనుప వస్తువులతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మోహన్‌ను కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య సావిత్రీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ముగ్గురిపైనా హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం వీరికి రిమాండ్ విధించింది. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మోహన్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. ఘటన జరిగిన రోజు మోహన్‌కు చెందిన కోడి, దాని పిల్లలు శంకర్ ఇంటివైపు వెళ్లాయి. ఇందులో కొన్ని చనిపోవడంతో.. నోరు లేని కోడి పిల్లలను ఎలా చంపాలనిపించిందంటూ శంకర్ కుటుంబ సభ్యులను మోహన్ నిలదీశాడు. పాత కక్షలతో కోపోద్రిక్తులైన వారు అతనిపై దాడికి తెగబడ్డారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

ఏడీఏ లక్ష్మీకుమారి


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

కుల్కచర్ల: ఎరువులను ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియా కోసం వచ్చిన రైతులకు లేవని చెప్పి పంపిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. యూరియాలో సన్న రకం, దొడ్డు రకం రెండు ఉన్నాయని రెండింటిలో ఎటువంటి తేడాలు లేవన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

భారీ శబ్దాలతో భయందోళన


అనుమానిత ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం సిద్ధన్నమడుగుతండా, ఎర్రగడ్డతండా, ఆత్కూర్ గ్రామాల్లో భారీ శబ్దాలతో ప్రజలు భయందోళన చెందారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 7 గంటల వరకు భూమి కంపించే విధంగా భారీ చప్పుళ్లు వినిపించాయని తండావాసులు వాపోతున్నారు. ఆత్కూర్ గ్రామ శివారులో ఉన్న ఓ క్రషర్ మిషన్‌కు సంబంధించి గనులు ఉన్నాయని అక్కడ బ్లాస్టింగ్ చేయడంతో శబ్దాలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దేముల్ పోలీసులు మధ్యాహ్నంపర్యటించి అనుమానిత ప్రదేశాలను పరిశీలించారు.

ఈసీవాగులో కూలీ గల్లంతు?


సాయన్న (ఫైల్)

పూడూరు: కంకల్ ఈసీ వాగులో ఓ వ్యవసాయ కూలీ గల్లంతైన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కంకల్ గ్రామానికి చెందిన మంగళి సాయన్న(36) వ్యవసాయ కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఈసీ వాగు సమీపంలో ఉన్న పత్తి పొలంలో పత్తి దంతె పట్టేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తిరిగి పొలానికి వెళ్లే క్రమంలో ఈసీ వాగు ఉధృతి ఎక్కువ కావడంతో అందులో పడి పోయి ఉండవచ్చని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. కాగా సాయన్నకు ఈత రాదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. బాధితుని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసత్య వార్తలపై ఫిర్యాదు

దోమ: విధుల్లో ఉన్నా లేనట్లుఅసత్య కథనాలు రాసి, తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మోత్కూరు అంగన్‌వాడీ టీచర్ సువర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ పత్రికలో అసత్య వార్తలు రాసిన రిపోర్టర్‌పై దోమ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. తనపై అవాస్తవాలు చిమ్మిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కూలీల కొరత.. రైతులకు వెత


నాటు వేసేందుకు సిద్ధంగా వరినారు

- భారీగా పెరిగిన కూలీ రేట్లు
- వరినాట్లకు తీవ్ర ఇబ్బందులు
- కలుపుతీతకు రసాయనాల పిచికారీ

పరిగి: వర్షాలు సరిగ్గా పడక సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయి. వారం రోజులుగా వానలు లేక పోవడం, బోర్లల్లో నీరు తగ్గడంతో వరినాట్లు వేయాలనుకునే చిన్న, సన్నకారు రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు కూలీల కొరతతో విలవిలలాడే పరిస్థితి నెలకొంది. వర్షాధార పంటలకు కలుపు తీసేందుకు కూలీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అటు వరి నాట్లు, కలుపుతీత తీసే రైతులు ఒకేసారి పనులు చేయిస్తుండటంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడింది. వలస కూలీలతో పనులను చేయిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో వరి నాట్లు వేసేందుకు కూలీల రేట్లు రెండింతలు కాగా సాగు పెట్టుబడి కూడా పెరిగింది. సాధారణంగా ఒక్కో కూలీకి రూ.250 నుంచి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.1,000 వరకు తీసుకుంటున్నారు.

దెబ్బతింటున్న పంటలు

జిల్లా వ్యాప్తంగా రైతులు వర్షాధార పంటలపైనే ఆధారం. ఖరీఫ్ సీజన్‌లో గతేడాది కురిసిన వర్షపాతానికి ఈసారి చాలా తక్కువగా కురిశాయి. అయినా పంటల సాగుపైన దృష్టి సారించారు. వరి నాట్లు వేయడం, పొలాల్లో కలుపు మొక్కలను తొలగించడానికి కూలీలు అవసరం ఏర్పడింది. వరినాట్లు వేసేందుకు పంట పొలాలను సిద్ధం చేసినా కూలీల కొరతతో సమయానికి నాట్లు పడటం లేదని రైతులు దిగులు చెందుతున్నారు. కూలీల కొరత ఒకవైపు భారీగా పెరిగిన కూలీల రేట్లతో కర్షకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అదునుకు కలుపు తీత తీయకపోవడంతో పంటను మించి కలుపు పెరిగిపోతుంది. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. కొంత మంది రైతులు కూలీలు దొరక్క సాగు చేసిన పంటలో కలుపు తీత తీయకుండా రసాయనాలు పిచికారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికే వరి నాట్లు వేసి కలుపులు తీయాల్సి ఉండగా ఇంకా పూర్తిగా నాట్లే పడలేదు. నారుమళ్లు ముదిరి పోవడంతో పంట దిగుబడిపై దెబ్బపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరతతో కలుపు తీసేందుకు, వరి నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

రెండింతలు పెరిగాయి

కూలీల రేట్లు రెండింతలు కావడంతో పెట్టుబడి కూడా భారీగా పెరుగుతోంది. రేట్లు పెరిగినా కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. గతంలో గ్రామాల్లో కూలీల కొరత ఉండేది కాదు. కాలానుగుణంగా వ్యవసాయ కూలీలు చేసే వారి సంఖ్య భారీగా తగ్గుతుంది. దీంతో డిమాండ్ పెరిగింది.

– రవికుమార్, రైతు మోత్కూర్

కష్టంగా సాగు

పంట సాగు చేయాలంటే కష్టంగా మారింది. వ్యవసాయం చేయడానికి కూలీలు కచ్చితంగా అవసరం. విత్తనాలు విత్తిన నాటి నుంచి కోత నూర్పిడి తదితర పనులకు కూలీలు ఉండాలి. రైతులంతా ఒకేసారి ఒకే పంట సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడుతోంది.

– శ్రీనివాస్, ఐనాపూర్

రైతులకు అండగా కేంద్రం


అనంతగిరి: కరపత్రం పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


దోమ: దాదాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డి

అనంతగిరి: ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువతను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముద్ర రుణాలను కేంద్రం అందజేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలంలోని రాళ్ల చిట్టెంపల్లి, మైలార్ దేవరంపల్లి గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం ప్రారంభించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని రైతులకు పెట్టుబడి సహాయం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని వివరించారు. రైతులపై భారం పడకుండా ఎరువులను కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు శివరాజ్ గౌడ్, జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, నాయకులు మల్లేష్, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

దోమ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు బొంగు మల్లేశం అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో బీజేపీ ప్రవేశపెడుతున్న పథకాలను కార్యకర్తలతో కలిసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సత్యం, నాయకులు అశోక్, శ్రీనివాస్, శ్రీనుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీశైలం, మాదవులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీజీఈపీసెట్ ధ్రువపత్రాల పరిశీలన

అనంతగిరి: టీజీఈపీసెట్–2025 చివరి విడత ధ్రువపత్రాల పరిశీలన బుధవారం వికారాబాద్‌లోని ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశం పొందే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొమ్మిదేళ్ల చిన్నారిపై యువకుడి అఘాయిత్యం

పూడూరు: తొమ్మిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని దేహశుద్ధి చేసి పోలీసులకు ఈ సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల పరిధిలోని నేవీరాడార్‌లో బిహార్‌కు చెందిన పలు కుటుంబాలు పనిచేస్తున్నాయి. ఇదే రాష్ట్రానికి చెందిన కృష్ణకుమార్ (24) ఓ తొమ్మిదేళ్ల చిన్నారిని లేబర్ కోసం నిర్మించిన షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఇది గమనించిన చిన్నారి కుటుంబ సభ్యులు అతనికి దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆస్పత్రికి తరలించారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రిన్సిపాల్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. బుధ, గురువారాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వాటిని పరిశీలించి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు 8న ఉదయం 10గంటలకు అన్ని ఒరిజినల్స్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్‌లతో రిపోర్టు చేయాలన్నారు. సీటు లభించిన వారు వెంటనే రూ.5,080 కౌన్సిలింగ్ ఫీజు వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియామకం


శ్రీదేవి

అనంతగిరి: బీజేపీ పార్టీ వికారాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మహిళ కన్వీనర్‌గా వికారాబాద్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ టి.శ్రీదేవిసదానందరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు పాటుపడుతామని, పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. బాధ్యతలు అప్పగించినందుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి దుర్మరణం

నిజాంపేట్: నగర శివారులోని ప్రగతినగర్ ఎలీప్ సర్కిల్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ఒక వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైకు నడుపుతున్న బీటెక్ విద్యార్థి నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల దొంగకు రిమాండ్

నాలుగు బైక్‌లు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మీనారాయణ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఠాణాలో సీఐ విజయ్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చెరుకుపల్లికి చెందిన నర్సింలు జూన్ 19న ద్విచక్ర వాహనంపై షాద్‌నగర్‌కు వచ్చాడు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కొరియర్ కార్యాలయం పక్కన తన బైక్ పార్క్ చేసి వెళ్లాడు. మరునాడు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో ఆయన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక నైపుణ్యంతో కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వకు చెందిన కొర్రా వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు.

నాలుగు బైక్‌లు స్వాధీనం

నిందితుడిపై ఇప్పటికే షాద్‌నగర్ ఠాణా పరిధిలో నాలుగు, ఆర్‌జీఐ పీఎస్ పరిధిలో ఒకటి, కొత్తూరు పరిధిలో నాలుగు, అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు కేసులు నమోదై జైలు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. నిందితుడి నుండి రూ.2 లక్షల విలువ చేసే బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శివారెడ్డి, సిబ్బంది రవీందర్, సంతోశ్, కర్ణాకర్, జాకీర్, రాజు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్లకు..

ఇబ్రహీంపట్నం: ఇద్దరు చైన్ స్నాచర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తలకొండపల్లికి చెందిన సంఫీ నాగరాజు(25) అల్మాస్‌గూడలో నివసిస్తూ ఆమెజాన్ కంపెనీలో ప్యాకింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. 2023లో ఓ రేప్ కేసులో జైల్‌కు వెళ్లి వచ్చాడు. షార్ట్ ఫిల్మ్‌లు తీస్తున్న నాగరాజుకు నెల రోజుల క్రితం జడ్చర్లకు చెందిన వేదవ్యాస్ (24)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఒకే రూంలో ఉంటున్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు ఇరువురూ సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్ బాటపట్టారు. ఈ నెల 1వ తేదీన పోల్కంపల్లి పంచాయతీ పరిధిలోని జాజోనిబావికి చెందిన లావణ్య(33) తమ పొలంలో పశువులను మేపుతుండగా నాగరాజు, వేదవ్యాస్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోంచి పుస్తెల తాడును అపహరించేందుకు యత్నించారు. సదరు మహిళ అప్రమత్తమై గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చారు. అప్రమత్తమైన దుండగులు వెంటనే పుస్తెలతాడును వదిలి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న క్రమంలో మంగళవారం మంగళ్‌పల్లి వద్ద చైన్ స్నాచింగ్ కోసం యత్నిస్తూ పోలీసులకు చిక్కారు. చైన్‌స్నాచింగ్‌కు వాడిన వేదవ్యాస్ ఆర్15 బైక్‌ను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఇబ్బందులు దారి'కొచ్చేలా..

ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్ల కోసం రూ. 960 కోట్లు

- మూడు ఫ్లై ఓవర్లు, ఆర్ఓబీ, ఇతరత్రా రోడ్లు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు పలు సందర్భాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నాయి. ఆయా సందర్భాల్లో కొన్ని మిలిటరీ రోడ్లను మూసివేస్తుండటంతో పడరాని పాట్లు పడుతున్నారు. తీవ్ర ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. ఎంతో కాలంగా ప్రజలు పడుతున్న ఈ బాధలకు చెక్ పెట్టేలా ఏఓసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కారప్స్) సెంటర్ దగ్గర ప్రత్యామ్నాయ మార్గాల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. మూడు ఫ్లై ఓవర్లు, ఒక ఆర్ఓబీ, కొన్ని గ్రేడ్ రోడ్ల నిర్మాణాల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచింది. వీటి నిర్మాణాల అంచనా వ్యయం రూ.307 కోట్లు కాగా, స్థలాల సేకరణ తదితరాలు కలిపి మొత్తం ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.960 కోట్లుగా అధికారులు తెలిపారు. ఫ్లై ఓవర్లను వెల్లింగ్టన్ రోడ్ –ఎలివేటెడ్ రోటరీ, ఈస్ట్ మారేడ్‌పల్లి–ఎలివేటెడ్ రోటరీ, ఎలివేటెడ్ రోటరీ –సఫిల్‌గూడ వరకు నిర్మించనున్నారు. వీటితో పాటు ఎస్ఎం సైడింగ్స్‌పై ఆర్వోబీని, వెల్లింగ్టన్ రోడ్, ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్, మహేంద్రహిల్స్ – ఆర్‌కేపురం ఆరోఓబీ వద్ద ఎట్‌గ్రేడ్ రోడ్లు నిర్మించనున్నారు.

నిర్మాణాలు ఇలా..

వీటిల్లో వెల్లింగ్టన్ రోడ్–ఎలివేటెడ్ రోటరీ వరకు ఫ్లై ఓవర్ నాలుగులేన్లతో, ఫుట్‌పాత్‌లతో, 12 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈస్ట్ మారేడ్‌పల్లి–ఎలివేటెడ్ రోటరీ కూడా నాలుగులేన్లు, ఫుట్‌పాత్‌లతో 15 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని, ఆర్ఓబీ 22 మీటర్ల క్యారేజ్‌వేతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే మల్కాజిగిరి, సఫిల్‌గూడ, సైనిక్‌పురి, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల వారికి సాఫీ ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

లైసెన్స్‌ల జారీలో దళారుల దగా!

- ఆబ్కారీ అధికారుల పేరుతో మధ్యవర్తుల వసూళ్లు
- ఎక్మాయిలో ఓ గీత కార్మికుడి నిలువు దోపిడీ


బాధితుడు బాలయ్య

బషీరాబాద్: టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీలో అవినీతి రాజ్యమేలుతోంది. కల్లు విక్రయించేందుకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ గీత కార్మికుడి నుంచి మధ్యవర్తులు ఏకంగా రూ.85 వేలు వసూలు చేశారు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయిలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పోతుల బాలయ్యగౌడ్ వ్యవసాయంతో పాటు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతను కల్లు దుకాణం లైసెన్స్ కోసం ఈఏడాది జనవరిలో తాండూరు ఆబ్కారీ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఫిబ్రవరి 19న ఇతనికి టాపింగ్ పరీక్ష నిర్వహించిన అధికారులు లైసెన్స్ జారీ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. రోజులు గడుస్తున్నా లైసెన్స్ రాకపోవడంతో బాధితుడు ఓ స్థానిక నాయకుడిని ఆశ్రయించాడు. ఇందుకు రూ.70 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో తన భార్య బంగారాన్ని తాకట్టు పెట్టి.. సదరు లీడర్‌కు రూ.65 వేలు ఇచ్చాడు. అనంతరం ఎన్నిసార్లు వాకబు చేసినా ఏదో కారణం చెబుతూ దాటవేయడంతో బాధితుడు ఎక్సైజ్ కార్యాలయంలో పనిచేసే ఓ ప్రైవేటు ఉద్యోగిని సంప్రదించాడు. రూ.40 వేలు ఇస్తే అధికారులతో పని పూర్తి చేయిస్తానని చెప్పడంతో రూ.20 వేలు ఇచ్చాడు. ఈక్రమంలో అతనికి లైసెన్స్ మంజూరైంది. ఇదిలా ఉండగా తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితుడు బాలయ్య, అతని భార్య నర్సింగమ్మ మంగళవారం సదరు నాయకుడిని నిలదీశారు. అయితే నేను పైరవీ చేయడంతోనే మీకు లైసెన్స్ వచ్చిందంటూ లీడర్ తమను దబాయించాడని బాధితులు వాపోయారు.

మా ప్రమేయం లేదు

గీత కార్మికుడు పోతుల బాలయ్య దరఖాస్తును పరిశీలించి, అన్ని పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అన్ని అర్హతలు కలిగి ఉండటంతో అతనికి లైసెన్స్ జారీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వ ఛాలన్ డబ్బులు మాత్రమే కట్టించుకున్నాం. మధ్యవర్తులు తీసుకున్న డబ్బులతో మాకెలాంటి సంబంధం లేదు.

– రవికుమార్, ఎక్సైజ్ ఎస్‌ఐ

కాపాడబోయి కన్ను మూశారు

- బావిలో దూకిన భార్యను రక్షించబోయిన భర్త మృతి
- అక్కను కాపాడే క్రమంలో చెల్లి దుర్మరణం

మోమిన్‌పేట: డబ్బుల విషయంలో నెలకొన్న చిన్నపాటి గొడవ ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లికి చెందిన గాగోళ్ల మాసయ్య(60), ఇతని భార్య అలివేలు వికారాబాద్ జిల్లా చీమల్దరిలోని ఓ వెంచర్‌లో పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే అలివేలు చెల్లి నాగమ్మ నాలుగు రోజుల క్రితం వీరి వద్దకు వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో తాను చనిపోతానంటూ అలివేలు వెంచర్ పక్కనే ఉన్న బావిలో దూకింది. ఆమెను కాపాడేందుకు మాసయ్య సైతం దూకాడు. అక్క మునిగిపోతోందని గమనించిన నాగమ్మ ఒడ్డుపైనుంచి తన చెయ్యి అందించే క్రమంలో బావిలో జారిపడింది. అక్కడే అలివేలును కాపాడగా మాసయ్య, నాగమ్మ నీటిలో మునిగిపోయారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అరవింద్ పంచానామా నిర్వహించారు. మృతుని భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఓ కుమారుడు, మృతురాలికి ఓ కూతురు ఉన్నారు.

రైతుల పొలాల్లో ఆస్తుల సర్వే


చెట్లను పరిశీలిస్తున్న సర్వేయర్లు

దుద్యాల్: మండల పరిధిలోని పారిశ్రామికవాడ ఏర్పాటుకు పనులు చకచకా జరుగుతున్నాయి. భూములు ఇచ్చిన రైతుల పొలాల్లో ఉన్న ఆస్తులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని హకీంపేట్ గ్రామ పరిధిలోని ఇటీవల భూములు ఇచ్చిన రైతులు పొలాల్లో పెద్ద పెద్ద వృక్షాలు, బోర్లు, పశువుల షెడ్లకు సంబంధించి వివరాలను మంగళవారం సేకరించారు. గతంలో కొంత మందికి పొలాల్లో ఉన్న ఆస్తులకు సంబంధించి పరిహారం ప్రభుత్వం అందించింది. ఈ సందర్భంగా రైతుల పొలాల్లో ఆస్తుల వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదించామని తహసీల్దార్ కిషన్ తెలిపారు. సర్వేలో హార్టికల్చర్ అధికారి సురేంద్రనాథ్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు అడ్డు కంచె తొలగింపు

సద్దుమణిగిన వివాదం


గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న బూర్గుల సుమన

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో నెలకొన్న దళితవాడకు అడ్డంగా కంచె వివాదం సద్దుమణిగింది. రాకపోకలకు ఇబ్బందులు రాకుండా దారిని ఏర్పాటు చేశారు. కంచె ఏర్పాటుపై మంగళవారం దళిత సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ, టీఎమ్మార్పీఎస్, ధర్మసమాజ్ పార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అడ్డుగా వేసిన కంచెను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అవసరాల కోసం ఇచ్చిన స్థలంలో కంచె వేయడం ఏమిటని ప్రశ్నించారు. దళితులకు దారి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతోనే కంచె ఏర్పాటు చేశారని ఆరోపించారు. కంచె ఏర్పాటుతో దళితులు తమ ఇళ్లకు రాకపోకలు కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. కంచె ఏర్పాటుతో ఇబ్బంది కలుగుతుందంటే తొలగిస్తామని బూర్గుల నర్సింగ్‌రావు సోదరి సుమన చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వివిధ సంఘాల నాయకులు సామేల్, జంగయ్య, చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనునాయక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం ఏర్పాటు చేస్తాం

స్వాతంత్ర్య సమరయోధుడు బూర్గుల నర్సింగ్‌రావు గ్రామ అవసరాలకు ఇచ్చిన స్థలంలో ఆయన స్మృతివనం ఏర్పాటు చేస్తామని ఆయన సోదరి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బూర్గుల సుమన వెల్లడించారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన ఆమె గ్రామస్తులు, దళితులతో మాట్లాడారు. దళితులు వెళ్లడానికి దారి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామానికి ఇచ్చిన స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారని, ఆ స్థలంలో బోర్లు వేసి గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నారని అన్నారు. ఆ స్థలంలో బూర్గుల నర్సింగ్‌రావు ఉద్యానవనం ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారని, ఆ కోరిక తీరకుండానే ఆయన మృతి చెందారని చెప్పారు. ఏ రోజూ తాము ఆ స్థలాన్ని తిరిగి తీసుకోవాలనే ఆలోచన చేయలేదన్నారు. స్మృతివనం ఏర్పాటు చేస్తే మొక్కలను పశువులు మేస్తాయనే ఆలోచతో కంచె వేశామే తప్ప ఆక్రమించుకునేందుకు కాదని స్పష్టం చేశారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య


ఇటీవల సంఘం సాధించిన అవార్డులతో పాలకవర్గ సభ్యులు

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం డీసీసీబీ చైర్మన్ అధ్యక్షతన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 23 మంది సభ్యులను సంఘంలో నూతనంగా చేర్చుకున్నామని, 24 మంది రైతులకు రూ. 2.65 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఆడిట్ సర్టిఫికెట్‌ను ఆమోదించడంతో పాటు, 2025–26 మే 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు మూడు నెలల జమా ఖర్చులను ఆమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, సంజీవ రెడ్డి, యాదగిరి, ఎస్.లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


మంచన్‌పల్లి లోకేశ్

హస్తినాపురం: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గిరీష్‌కుమార్ వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామానికి చెందిన మంచన్‌పల్లి లోకేశ్(31) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఉంటున్నాడు. గత కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనస్తాపం చెంది గత నెల 26న పురుగుల మందు తాగడంతో వెంటనే కుటుంబ సభ్యులు బండ్లగూడ జాగీర్‌లోని మెడిలైఫ్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.